క్లుప్తంగా

ప్రిన్సిపాల్‌కు సన్మానం



సదానందాన్ని సన్మానిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ లోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ సదానందంను కేయూ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ వెంకట గోపీనాథ్ గురువారం సన్మానించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సూర్యం, రాజేశ్వరి, శ్రీలత, కల్పన, మణిష్ పాల్గొన్నారు.

బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

వరంగల్ అర్బన్: ప్రభుత్వం, అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా ఓ సంస్థ పేరుతో.. కొత్తగా ఇళ్లు కట్టుకుంటున్న యజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తూ, బల్దియా అధికారులను బ్లాక్ చేస్తున్న సామాజిక కార్యకర్త పెరుమాండ్ల లక్ష్మణ్‌పై మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో గ్రేటర్ వరంగల్ కమిషనర్ పేరుతో సిబ్బంది ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం పెరుమాండ్ల లక్ష్మణ్‌పై మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు కేసు నమోదు ఈ విషయాన్ని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారికంగా మీడియాకు వెల్లడించారు. దీనిపై పెరుమాండ్ల లక్ష్మణ్‌ను వివరణ కోరగా తనపై వచ్చిన ఆరోపణలను న్యాయపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

టీఎస్ఎఫ్ గ్రేటర్ వరంగల్ సిటీ అధ్యక్షుడిగా మణితేజ



కేయూ క్యాంపస్: తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) గ్రేటర్ వరంగ్ సిటీ అధ్యక్షుడిగా నాగారం మణితేజ ఎన్నికయ్యారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం నిర్వహించిన సంఘం సమావేశంలో మణితేజను ఎన్నుకున్నట్లు టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్ తెలిపారు.

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా భరత్‌వీర్



గీసుకొండ : బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా వరంగల్ 22వ డివిజన్ బ్యాంకు కాలనీకి చెందిన ఎర్రగోళ్ల భరత్‌వీర్‌ను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేటర్ 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ కార్యాలయంలో ఈ మేరకు భరత్‌వీర్‌కు నియామకపత్రాన్ని ఆయన అందించారు. కాగా, తన నియామకానికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ ముఖ్య నాయకులకు భరత్‌వీర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో మోసం

వరంగల్ క్రైం: ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో వెతకగా, ఓ వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు నట్టేట ముంచారు. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డికాలనీకి చెందిన శ్రవణ్.. ఉద్యోగం కోసం ఆన్‌లైన్ వెతికాడు. కార్లను ఆన్‌లైన్‌లో బుక్ చేయడం వల్ల ఆదాయం వస్తుందని గుర్తు తెలియని వ్యక్తులు నమ్మించారు. ఆ విషయాన్ని నమ్మి పనిచేయగా మొదట్లో కొన్ని డబ్బులు ఆశ చూపి ఆ తర్వాత శ్రవణ్ నుంచి పలు దఫాలుగా రూ.1.63 లక్షల వరకు నిందితులు వసూలు చేశారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు.. పోలీసులకు ఫిర్యాదు చేయగా హనుమకొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మడికొండ: పెరిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మడికొండ శివారులోని రామన్ స్కూల్ ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సామిశెట్టి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర పెరిక కుల ఆత్మగౌరవ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గటిక విజయ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూసాని శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి ఆనంద్, కార్యనిర్వహణాధికారి విజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు గజవెల్లి వేణుమాధవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామినేని రాజేష్, కోశాధికారి బుద్దె గణేష్, కార్యదర్శి శ్రీధర్ల ఈశ్వర్‌కుమార్, ప్రచార కార్యదర్శి అచ్చె జగన్, కుమార్, రాజు, చంద్రశేఖర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ రావాలని ప్రార్థనలు

హన్మకొండ చౌరస్తా: సెయింట్ పాల్ స్కూల్ అధినేత మోసెస్ ఆనంద్‌కు కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ ఎంపీ టికెట్ రావాలని ఆకాంక్షిస్తూ ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జెరూసలేం బాప్టిస్టు చర్చిలో గురువారం ప్రార్థనలు చేశారు.

కేరళ ప్రభుత్వంపై కేంద్రం వివక్ష



హన్మకొండ: ధర్నా చేస్తున్న నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామిక వాదులు



న్యూశాయంపేట: సమావేశంలో నాయకులు

హన్మకొండ: కేరళ ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని, ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. దేశానికే పరిపాలనలో ఆదర్శంగా ఉన్న కేరళ ప్రభుత్వంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం.. రాష్ట్ర గవర్నర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో మితిమీరిన రాజకీయ జోక్యం, వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. బీజేపీయేతర ప్రభుత్వాల పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని దేశంలోని ప్రజాస్వామ్యవాదులందరు ఖండించాలని, కేంద్ర వైఖరికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.చుక్కయ్య, టి.ఉప్పలయ్య, జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్, మంద సంపత్, జి.రాములు, డి.భాను నాయక్, నాయకులు ఎన్.కిశోర్, యాకయ్య, వల్లెపు లింగమూర్తి, రాజు, కుమార్, పుల్ల అశోక్, ఓరుగంటి సాంబయ్య, కొమురెల్లి, కూస రాజేష్, జగన్, ఎం.రమాదేవి, విజయ, సునీత, సమ్మక్క, లచ్చమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

దేశ్‌కో బచావో.. మోదీకో హటావో

న్యూశాయంపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశ్ కో బచావో.. మోదీకో హటావో నినాదంతో ఈనెల 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష రాజకీయ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా సదస్సు తీర్మానం చేసింది. ఈమేరకు హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి అధ్యక్షతన హనుమకొండ జిల్లా సదస్సు గురువారం జరిగింది. సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. అఖిలపక్ష నాయకులు బి.చక్రపాణి, హంసారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సారయ్య, సంపత్, రాజేశ్, యాకయ్య, రవీందర్, సాంబయ్య, బాలరాజు, రాగుల రమేష్, వెంకటేశ్వర్లు, రాములు, చుక్కయ్య, లక్ష్మణ్, శ్యాంసుందర్, మద్దెల ఎల్లేశ్, ఎమ్మెస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసేవారు ప్రాణదాతలు



సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్టీఓ రంగారావు

ఖిలా వరంగల్: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షించినట్లవుతుందని వరంగల్ జిల్లా రవాణాశాఖ ఆర్టీఓ రంగారావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వరంగల్ – ఖమ్మం రోడ్డులోని వరంగల్ జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఎంవీఐ రమేష్‌రాథోడ్, రవీందర్ అధ్యక్షతన గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా నష్టం కలుగుతుందనే అపోహను విడనాడాలని సూచించారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ బ్లెడ్ బ్యాంక్ సెంటర్ వైద్యులు 56 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఈవీ శ్రీనివాస్, ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు స్వరూప్‌రెడ్డి, వాహనదారులు పాల్గొన్నారు.

28న ఏఐవైఎఫ్ రాష్ట్ర సమ్మేళనం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్ / న్యూశాయంపేట: వరంగల్ ములుగు రోడ్డులోని ఎల్బీ కళాశాల జయసేన ఆడిటోరియంలో ఈనెల 28న యువత కర్తవ్యం అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీఉల్లా ఖాద్రీ తెలిపారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో గురువారం జరిగిన సమావేశంలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని యువజన, విద్యార్థి, మేధావి వర్గ బాధ్యులను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. దేశంలో యువత జనాభా ఎక్కువ ఉందని చెప్పారు. ప్రపంచంలో 186కోట్ల మంది యువజనులు ఉంటే అందులో 28శాతం భారతీయులేనని వివరించారు. దేశంలో 30శాతం మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవని విమర్శించారు. దేశ పాలకుల విధానాలు – నేటి యువత కర్తవ్యం అనే అంశంపై ఈనెల 28న నిర్వహించనున్న యువజన రాష్ట్ర సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మస్కక సుధీర్, భాస్కర్, ఫయాజ్, జగదీష్, సుమన్, రామన్, అనిల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ పరిధిలో పటిష్ట నిఘా



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఖిలా వరంగల్: స్టేషన్ పరిధిలో పగలు, రాత్రి పూర్తి స్థాయిలో నిఘా పెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. అపరిచితుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో గురువారం సాయంత్రం పిల్లలను ఎత్తుకెళ్లే కిడ్నాపర్లు ఆటోల్లో సంచరించారన్న వార్త కలకలం రేపింది. దాంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య.. హుటాహుటిన ఉర్సు కరీమాబాద్ స్కూల్ ప్రాంతానికి చేరుకున్నారు. స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుమానితులు ఎవరూ సంచరించలేదని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజు, వెంకన్న, మున్నీరుల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ ఇన్‌స్పెక్టర్‌గా సతీష్ బాధ్యతల స్వీకరణ



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం రాత్రి జరిగిన ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా హనుమకొండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన ఎడ్లవల్లి సతీష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

మిల్స్‌కాలనీ ఎస్‌హెచ్‌ఓగా మల్లయ్య..



ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా పి.మల్లయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏసీపీ బోనాల కిషన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్‌కు మిల్స్‌కాలనీ ఎస్సైలు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మడికొండ: మాస శివరాత్రిని పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. సీతారామచంద్రస్వామి ఆలయంలోనూ పూజలు చేశారు. అనంతరం, యాగశాలలో గణపతి హోమం, రుద్రహోమం నిర్వహించారు. మాస శివరాత్రి కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు అర్చకులు దర్శనం కల్పించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణశర్మ, దేవేందర్ శర్మ, సాయిశర్మ, భక్తులు సురేష్, రాజేందర్, రవి, వెంకన్న, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అయిన మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణుకు సన్మానం



మడికొండ: బదిలీ అయిన మడికొండ పోలీసు ఇన్‌స్పెక్టర్ వేణును స్టేషన్‌లో స్థానిక నాయకులు, తోటి పోలీసు సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం మహేందర్, దార ధనుంజయ్, బండ రాజు, పోలీసు సిబ్బంది ఎస్సై రాజబాబు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏసీపీ బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ ఏసీపీగా పనిచేస్తున్న ఎం.భోజరాజును బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్త ఉత్తర్వులు జారీ చేశారు. భోజరాజు.. ట్రాఫిక్ నుంచి వరంగల్ పీటీసీ డీఎస్పీగా బదిలీ అయ్యారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: కుక్కలు, కోతులు, దోమల స్వైర విహారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు సమస్యలను పరిష్కరించాలని కాజీపేట మినీ మున్సిపల్ కార్యాలయంలోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట పార్టీ మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామలింగం మాట్లాడుతూ కాజీపేట పట్టణంలో కోతులు, కుక్కలు, దోమల విజృంభనతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారని చెప్పారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ధర్నా కార్యక్రమంలో నాయకులు మణికుమార్, అలీమ్, సాంబయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్‌ను అరెస్టు చేయాలి



ఫిర్యాదు చేస్తున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసి దూషించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలకర్రి ఆనంద్‌మోహన్, సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ షుకూర్‌కు న్యాయవాదులు గురువారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు సామంతల శ్రీనివాస్, గునిగంటి శ్రీనివాస్‌గౌడ్, బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దయ్యాల సుధాకర్, పోతురాజు రవి, సీహెచ్.రవికుమార్, గన్ను హరిహరకుమార్, పిల్లి కార్తీక్, సాయిని నరేందర్, చింతా నిఖిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా టీం సిద్ధంగా ఉండాలి



హన్మకొండ చౌరస్తా: త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలకు సోషల్ మీడియా టీం సిద్ధంగా ఉండాలని టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ సూచించారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో వరంగల్ పార్లమెంటు సెగ్మెంట్ జిల్లా, అసెంబ్లీ, మండల, డివిజన్ల కోఆర్డినేటర్ల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో సోషల్ మీడియా పాత్రను గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారని అన్నారు. సమావేశంలో ముస్తాక్ నేహాల్, దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరూప్‌నగర్ – మడిపల్లికి బస్సు నడపాలి



డిపో మేనేజర్ ధరంసింగ్‌కు వినతిపత్రం అందిస్తున్న నిరూప్‌నగర్ వాసులు

హన్మకొండ: హనుమకొండ నుంచి నిరూప్‌నగర్ మీదుగా మడిపల్లికి ఆర్టీసీ బస్సు నడపాలని నిరూప్‌నగర్ వాసులు కోరారు. కాంగ్రెస్ నాయకుడు భీమానాయక్ ఆధ్వర్యంలో ఆర్టీసీ హనుమకొండ డిపోలో డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్‌ను నిరూప్‌నగర్ వాసులు గురువారం కలిసి వినతిపత్రం అందించారు. మడిపల్లి, నిరూప్‌నగర్, ఆర్టీసీ కాలనీ, సప్తగిరి కాలనీలకు చెందిన విద్యార్థులు వివిధ విద్యాసంస్థల్లో చదువుకోవడానికి ఈ ప్రాంతం నుంచే రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. అలాగే, వివిధ పనుల నిమిత్తం ఆయా కాలనీల వాసులు కూడా హనుమకొండకు వచ్చి వెళ్తుంటారని చెప్పారు. ఈక్రమంలో హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ, సప్తగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్, నిరూప్‌నగర్ మీదుగా మడిపల్లి వరకు బస్సు నడపాలని కోరారు. కార్యక్రమంలో నిరూప్‌నగర్ వాసులు రవీందర్ రెడ్డి, పి.ప్రవీణ్, కె.రవీందర్, ఎల్.కుమార్, బి.సారయ్య, ఎన్.శ్రీనివాస్, బి.సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

'గావ్ చలో, మహిళా స్వశక్తి'ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకుడు

వరంగల్: కేంద్ర, రాష్ట్ర పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో గావ్ చలో అభియాన్, మహిళా స్వశక్తి అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ పిలుపునిచ్చారు. ఎల్బీనగర్ పార్టీ కార్యాలయంలో జిల్లా గావ్ చలో అభియాన్ కోఆర్డినేటర్ డాక్టర్ వన్నాల వెంకటరమణ, మహిళ స్వశక్తి అభియాన్ వరంగల్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకులు జిల్లాలో అన్ని వర్గాల ప్రజలను కలిసి ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, పాట్టి శ్రీనివాస్ గుప్తా, సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీఎల్‌సీఈ వాకర్స్ అసోసియేషన్



ప్రగతి వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

కేయూ క్యాంపస్: ఎస్‌డీఎల్‌సీఈ మైదానంలో గురువారం నిర్వహించిన వాకర్స్ సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈ ప్రగతి వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ నల్లాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గొడిశాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా బుర్ర రమేష్, దేవర యాదగిరి, సహాయ కార్యదర్శులుగా రఘుపతిరెడ్డి, డాక్టర్ బిల్లకంటి మహేందర్ రావు, సంయుక్త కార్యదర్శులుగా బండి మహేందర్, తాళ్లపెల్లి రామకృష్ణ, కోశాధికారిగా సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ దేశిని లక్ష్మీనారాయణ, క్రీడలు సాంస్కృతిక కన్వీనర్‌గా రావుల వెంకటరెడ్డి, కోకన్వీనర్‌గా దయాకర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శులుగా ఓదెల రాజేంద్రప్రసాద్, ముఖ్య సలహాదారులుగా డాక్టర్ సంగని మల్లేశ్వర్, లీగల్ అడ్వైజర్‌గా బింగి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

కాజీపేట అర్బన్: చల్లా కుమారస్వామి ఇటీవల అకాల మరణం చెందారు. కాగా, నగరంలోని 45వ డివిజన్ పరిధి తరాలపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1997 –98వ బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు.. మృతుడి కుటుంబానికి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. తమ తోటి మిత్రుడు మృతి చెందడంతో తోటి స్నేహితులందరు కలిసి సుమారు రూ.70 వేలు జమచేసి అందజేశారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించకపోతే సీజ్ చేస్తాం



చార్‌బౌళిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేస్తున్న బల్దియా సిబ్బంది

వరంగల్ చౌరస్తా: ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించకపోతే సీజ్ చేస్తామని బల్దియా శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంరాజ్ హెచ్చరించారు. గురువారం వరంగల్ 24, 25, 27 డివిజన్లలో వ్యాపార, వాణిజ్య షాపుల్లో ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూలుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. భారీగా బకాయిలున్న వ్యాపార సంస్థల నిర్వాహకులను హెచ్చరించారు. చార్‌బౌళిలోని నోబుల్ ఫంక్షన్ హాల్ నిర్వాహకుల నుంచి రూ.52,958 ట్రేడ్ ఫీజును వసూలు చేశారు.

ఆశ కార్యకర్తల నిరసన



వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

గీసుకొండ : నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు గురువారం ధర్నా చేశారు. సమయపాలన లేని డ్యూటీలు వేస్తూ, పనిభారాన్ని మోపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ వారు నిరసన తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు కాసు మాధవి మాట్లాడారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆశ కార్యకర్తల సంఘం నాయకులు పద్మ, రజిని, నిర్మల, రేణుక, మాధవి, రజియా, వనమాల, స్రవంతి, రాధిక, స్వప్న, సుజాత, సునీతల పాల్గొన్నారు. అనంతరం ఆశ కార్యకర్తల జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా చినగారి రాణి, కార్యదర్శిగా సీనపల్లి చైతన్యను ఎన్నుకున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య గురువారం సాయంత్రం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నేరస్తులు కుటుంబంతో కలిసి ప్రశాంతంగా జీవనం సాగించాలని సూచించారు. అల్లర్లు, గొడవలు, భూ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.